7

సాక్షి
ములుగు

శనివారం | 9 | మార్చి | 2024

రామప్ప ఆలయంలో భక్తుల సందడి



శంభో శివ శంభో..

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



ములుగు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పారిశుద్ధ్య కార్మికురాలు నర్సమ్మ, చిరు వ్యాపారి నీలం సాంబక్క, టైలర్ షేక్ నజీరాలను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతీ ఒక్కరికి మొదటి గురువు అమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గుట్లగట్టు సంజీవ, జనగాం బాబురావు పాల్గొన్నారు.

'హరీశ్‌రావు వ్యాఖ్యలు అభ్యంతరకరం'

టేకుమట్ల: ఉద్యోగుల జీతాలు ఆపి.. రైతులకు రైతుబంధు డబ్బులు వేయాలని.. ఉద్యోగులు ఏసీ రూమ్‌లలో కూర్చుంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని.. వెంటనే వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా బాధ్యులు బుచ్చిరాములు అన్నారు. శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి ఖండించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషిచేస్తున్న ఉద్యోగులను ఇలా అనడం సరైంది కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు రాకేష్‌రెడ్డి, దయాకర్, సతీష్, ఆనంద్, ఎండీ రఫీ, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

అవిశ్వాసానికి హైకోర్టు బ్రేక్

కాటారం: కాటారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఈ నెల 11న నిర్వహించనున్న అవిశ్వాస సమావేశానికి హైకోర్టు బ్రేక్‌వేసింది. పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ దబ్బెట స్వామిపై మిగితా పాలకవర్గ సభ్యులు అవిశ్వాసానికి తెరలేపారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన పలువురు డైరెక్టర్లు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెడుతూ ఫిబ్రవరి 15న జిల్లా సహకార శాఖ అధికారి శైలజకు తీర్మానపత్రం అందజేశారు. దీంతో ఈ నెల 11న అవిశ్వాసానికి సంబంధించిన సమావేశ నిర్వాహణకు జిల్లా సహకార శాఖ అధికారిణి ఉత్తర్వులు జారీచేశారు. ఇది ఇలాఉండగా చైర్మన్ చల్ల నారాయణరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సమావేశం నిర్వహించేందుకు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపేయాలని హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. ఈ విషయమై జిల్లా సహకార శాఖ అధికారని శైలజను వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు.

భూపాలపల్లి ఎస్సై బదిలీ

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై-1 శ్రావణ్‌కుమార్‌ను బదిలీచేస్తూ ఐజీ నాగిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని సుల్తాన్‌బాద్‌కు బదిలీ చేశారు. అక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ హరిశంకర్‌ను భూపాలపల్లి ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు.

పల్లెప్రకృతి వనం మొక్కలు దగ్ధం



రేగొండ (కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక గ్రామపంచాయతీ బృహత్ పల్లెప్రకృతి వనంలో మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. శుక్రవారం మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించగా ప్రకృతి వనంలో మంటలు చెలరేగి మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఏపీఓ జమీర్‌పాషా ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. పల్లెప్రకృతి వనంలోని సుమారు 15వేల మొక్కల్లో 40శాతం వరకు కాలిపోయాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాళేశ్వరంలో వైద్యసేవలు

కాళేశ్వరం: మహాశివరాత్రి సందర్భంగా కాళేశ్వరం దేవస్థానం ఆవరణ, బస్టాండ్, గోదావరి వద్ద మూడు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. శుక్రవారం రెండవ రోజు రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. ఈ క్యాంపులను డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య పర్యవేక్షించారు. కాళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుస్మిత, రఘురామ్, సింధు, ప్రియాంక, రాజయ్య, హెచ్ఈఓ స్వామి, రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ మాషుక్ అలీ, హెల్త్ అసిస్టెంట్‌లు రాజరమణయ్య పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



రామప్ప ఆలయంలో కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ ఆవరణలో అంగరంగ వైభవంగా రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కోమళ్లపల్లి హరీష్‌శర్మ, అర్చకుడు ఉమాశంకర్‌లు జరిపించారు. స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రముఖులు మందల వెంకటరమణారెడ్డి బహూకరించగా ఆలయ అర్చకుడు కల్యాణ తంతు జరిపించారు. ఈ వేడుకలో ఎస్పీ శబరీష్ దంపతులతో పాటు ప్రముఖులు అకిరెడ్డి రాంమోహన్‌రావు, డొలి రజితశ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి మంత్రి ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి సందర్భంగా మంత్రి ధనసరి సీతక్క రామప్ప ఆలయాన్ని సందర్శించి రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో కుమారుడు సూర్య దంపతులతో సీతక్క పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ నాయకులు బండి శ్రీనివాస్, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మిల్కూరి అయిలయ్య, చెన్నోజు సూర్యనారాయణ, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంగపేట: తలంబ్రాల బియ్యం కలుపుతున్న మహిళలు



మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతూ..

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాగరణ చేపట్టిన భక్తుల కోసం రామప్ప గార్డెన్‌లో సాయంత్రం 6:30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రముఖ పేరిణి నృత్యకారుడు రంజిత్ బృందం చేసిన పేరిణి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అంజయ్య బృందం ఆధ్వర్యంలో ఒగ్గుడోలు, 7:30 గంటలకు కృష్ణప్రియ నేతృత్వంలో కూచిపూడి నాట్యం, 8:30 గంటలకు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో హరికథ, 9:30 గంటలకు కల్యాణ్, రాణాప్రతాప్ ఆధ్వర్యంలో మిమిక్రీ, మ్యాజిక్ షో, 10:30 గంటలకు కాత్రగడ్డ హిమన్షి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యం, 11:30 గంటలకు అర్జున్ కళాబృందం ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా ప్రోగ్రాం భక్తులను ఆలరించింది.



అంజయ్య బృందం ఆధ్వర్యంలో ఒగ్గుడోలు విన్యాసాలు

విధేయతకే పట్టం..

- మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా బలరాంనాయక్
- ఇక మొదలుకానున్న పార్లమెంట్ ఎన్నికల ప్రచారం



పోరిక బలరాంనాయక్

సాక్షి, మహబూబాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాం నాయక్‌కు కేటాయించారు. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం విడుదల చేసిన జాబితాలో ఆయన పేరును ప్రకటించారు.

ఊహించిన విధంగానే..

మొదటి నుంచి అందరూ ఊహించినవిధంగానే ఏఐసీసీ పెద్దలతో విధేయతగా ఉండే బలరాం నాయక్‌కు మళ్లీ అవకాశం వచ్చింది. ములుగు నియోజకవర్గానికి చెందిన ఆయన 2009లో తొలిసారి మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాసరావుపై 68,957ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అప్పటి మన్మోహన్‌సింగ్ మంత్రి వర్గంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్) అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాంనాయక్ చేతిలో 34,992 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా పోటీచేసి బానోత్ శంకర్‌నాయక్ చేతిలో, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి మాలోత్ కవిత చేతిలో ఓడిపోయారు. కాగా ప్రస్తుతం మళ్లీ టికెట్ ఇవ్వడంతో ప్రచారం మొదలుపెట్టనున్నారు.

వాజేడులో మావోయిస్టు కరపత్రాలు

వాజేడు: మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, మొరుమూరు గ్రామాల మధ్య శుక్రవారం సీపీఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్రం పేరిట మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి. 114వ వార్షికోత్సవాన్ని విప్లవోత్సాహంతో జరుపుకుందాం. మణిపూర్ కుకీ ఆదివాసీ మహిళపై జరిగిన అమానవీయ అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదాం. కార్పొరేటీకరణ, సైనికీకరణ, బ్రాహ్మణీయ హిందుత్వ పాసిజంకు వ్యతిరేకంగా విశాల మహిళా పోరాటాలను నిర్మిద్దామని అందులో ఉంది. కాగా మావోయిస్టు కరపత్రాల కింద వైరుతో ఉన్న టార్చ్‌లైట్‌ను అమర్చారు. మావోయిస్టులు బాంబులను అమర్చి ఉంటారని అక్కడి ప్రజలు భయ కంపితులయ్యారు. కరపత్రాలు పడిన చోటుకు వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వర రావు, మరో ఎస్సై తిరుపతిరావులు అక్కడికి చేరుకుని బాంబ్ స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. ఎలాంటి బాంబ్‌లేదని నిర్ధారణకు వచ్చిన తర్వాత వైరును, కరపత్రాలను వాజేడుకు తీసుకువచ్చారు.



మావోయిస్టు కరపత్రాలు



కరపత్రాల కింద ఉన్న టార్చ్‌లైట్

ఆలయ అభివృద్ధికి కృషి..

చిట్యాల: మండలంలోని పలు ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఒడితల గ్రామంలోని శివాలయాన్ని శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అలయాల అభివృద్ధికి తన వంతుగా కృషిచేస్తానని పేర్కొన్నారు. ఒడితల శివాలయంలో పలు అభివృద్ధి పనులపై ఆలయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించుకోవాలని చెప్పారు. అనంతరం పూర్తి స్థాయిలో నిధులను కేటాయించి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చూడాలని ఆలయ కమిటీని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు గూట్ల తిరుపతి, గడ్డం కొంరయ్య, రాంనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

- రామప్పలో భక్తుల కిటకిట
- రామలింగేశ్వరస్వామికి పంచామృతంతో అభిషేకాలు
- ప్రముఖుల ప్రత్యేక పూజలు

వెంకటాపురం(ఎం): హరహర మహాదేవా శంభో శివశంకరా.. అంటూ శివనామస్మరణతో రామప్ప ఆలయం మారుమ్రోగింది. శుక్రవారం ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా రామప్ప ఆలయానికి తరలివచ్చి రామలింగేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలోని శివలింగం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. నందీశ్వరున్ని చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. రోజంతా ఉపవాసాలు ఉండి రామప్పలో కనులపండువగా జరిగే శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు రామప్పకు అధికసంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రామప్ప ఆలయానికి రావడంతో అభిషేక పూజలు 11 గంటల నుంచి 2 గంటల వరకు ఆలయ అధికారులు నిలిపేశారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రామప్ప ఆలయాన్ని ముస్లిం మహిళలు సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడం విశేషం. అలాగే వైద్యశాఖ ఆధ్వర్యంలో 392 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మినరల్ వాటర్‌ను అందించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ములుగు సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై చల్లా రాజు, ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ రాజులు అన్ని ఏర్పాట్లు చేశారు.



మంగపేట: ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రామప్ప ఆలయాన్ని సందర్శించిన ప్రముఖులు

మహాశివరాత్రి సందర్భంగా రామప్ప రామలింగేశ్వరస్వామిని కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా విద్యాధికారి పాణిని, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందంలు సందర్శించి రామప్ప రామలింగేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే వెంకటాపురం జెడ్పీటీసీ రుద్రమదేవిఅశోక్, ఎంపీపీ బుర్ర రజితసమ్మయ్య దంపతులు, టూరిజం అధికారులు సూర్యకిరణ్, అశోక్‌రెడ్డి, పుల్లారెడ్డి, రంజిత్‌లు రామలింగేశ్వరున్ని దర్శించుకున్నారు.



రామప్ప ఆలయ ఆవరణలోని శివలింగం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: గోదావరి ఒడ్డు వద్ద..



అభిషేకం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



రామప్ప ఆలయంలో ముస్లిం మహిళలు..



విద్యుత్‌లైట్ల వెలుగులో రామప్ప ఆలయం



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

- మరిన్ని ఫొటోలు 8,9లో▸

దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న సౌమ్య

వాజేడు: మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని జిల్లా ఐద్వా అధ్యక్షురాలు బచ్చలి సౌమ్య అన్నారు. మండల పరిధిలోని గుడిసెల ప్రదేశంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ కార్మిక మహిళలు తమ హక్కుల సాధనకు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక పోరాటాల ఫలితంగానే మార్చి 8 ప్రపంచ మహిళా దినోత్సవంగా నిలిచిందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు సాగుతున్నా ఇంటా, బయట అనేక అసమానతలకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, హైమావతి, యశోద, నవీన, శాంత, అనూష, ప్రమీళ, శారద, తిరుపతమ్మ ఉన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి

భూపాలపల్లి రూరల్: సింగరేణి కార్మికుల చిరకాల కోరికైన సొంతింటి కలను సింగరేణి యాజమాన్యం నెరవేర్చాలని ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి వైస్ ప్రెసిడెంట్ జోగ బుచ్చయ్య సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుచ్చయ్య మాట్లాడారు. కొన్ని సంవత్సరాల నుంచి కార్మికులు, సంఘాల కార్మికులు సొంతిళ్లు నిర్మించుకునేందుకు ప్రతి కార్మికుడికి 250 గజాల స్థలం కేటాయించాలని కోరినప్పటికీ సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ కూడా కార్మికులకు ఇంటిస్థలాన్ని ఇప్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ గుర్తింపు సంఘం హోదా రాకపోవడం కొంత బాధాకరమైనప్పటికీ ప్రాతినిధ్య సంఘం హోదాలో కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుంటామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఈ ఏడాది నుంచే ట్రైబల్ వర్సిటీ తరగతులు

ఈ ఏడాది (2024–2025) విద్యా సంవత్సరం నుంచి సమ్మక్క–సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తరగతులు ప్రారంభించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జాకారం సమీపంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే రామప్ప దేవాలయాన్ని సందర్శించి అభిషేక పూజలు నిర్వహించారు.

- వివరాలు 8లో▸

కలెక్టరేట్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలో గట్టమ్మ పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కలెక్టరేట్ భవనాన్ని ఏడాది లోపు ప్రారంభించుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు భవన నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించే విధంగా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ఇమ్మడి రాజుయాదవ్, రేవంత్‌యాదవ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బాల కుమారస్వామికి మంత్రి ప్రత్యేక పూజలు

మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో కొలువైన బాల కుమారస్వామికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం బాలకుమారస్వామికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ పూర్వీకులు అందించిన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. ములుగు మండలం జంగాలపల్లి నుంచి జగ్గన్నగూడెం వరకు రూ.34 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. అనంతరం మంత్రి సీతక్కను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, డాక్టర్ అల్లెం అప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

జంగమయ్యా.. నమోస్తుతే

ఘనంగా శివరాత్రి వేడుకలు | భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. అర్చనలు, అభిషేకాలు, జాగరణ పూజలతో కోర్కెలు తీర్చాలని భక్తులు జంగమయ్యను వేడుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా గంటల తరబడి క్యూలో నిలబడి శివయ్య దర్శనం చేసుకుని తరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేయిస్తంభాల ఆలయం, రామప్ప, మెట్టు రామలింగేశ్వరాలయం, పాలకుర్తి సోమేశ్వరాలయం, కాశీవిశ్వేశ్వరాలయంతోపాటు గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేసి, జాగరణ ఉపవాస దీక్షలు పాటించారు.

- సాక్షి నెట్‌వర్క్





వేయిస్తంభాల ఆలయంలో కల్యాణఘట్టం..



కాశిబుగ్గ కాశీవిశ్వేశ్వరాలయంలో సహస్ర లింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



రామప్పలో నంది విగ్రహం వద్ద భక్తుల సందడి



పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బారులుదీరిన భక్తులు



కాళేశ్వరంలో గోదావరి మాతకు మొక్కుతున్న భక్తులు



పాలకుర్తి సోమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు



రామప్ప రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు



రామప్పలో పేరిణి నృత్యప్రదర్శనలో రంజిత్ బృందం



కాళేశ్వరంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేయిస్తంభాల ఆలయంలో వద్ద భక్తుల క్యూ



బ్రహ్మకుమారీలు ప్రదర్శించిన 108శివలింగాలు



మెట్టుగుట్టపై కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కురవి భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో..

ఆల్ ఇండియా వర్సిటీ క్రాస్ కంట్రీ పోటీలకు కేయూ జట్లు



ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ పోటీలకు కేయూ జట్లతో కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్: నాందేడ్‌లోని ఎస్ఆర్‌టీఎంలో ఈనెల 10 నుంచి జరగబోయే ఆల్‌ఇండియా ఇంటర్ వర్సిటీ క్రాస్ కంట్రీ పోటీలకు కేయూ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ఆచార్య వెంకయ్య తెలిపారు. పురుషుల జట్టులో బి.విష్ణు, డి.గంగాధర్, కె.నాగరాజు (ఖమ్మం, ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ), టి.శ్రవణ్‌కుమార్, డి.రాజు, ఆర్ .రవితేజ (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, హనుమకొండ) ఉన్నారు. మహిళా జట్టులో పి.శృతి, జి.వినోద (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ), టి.సుమిత్ర (టీటీడబ్ల్యూఆర్డీసీ, ఉమెన్), ఎం.సింధు (కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల), సమ్రీన్ (ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ), బి.ఇందుప్రియ ఖమ్మం ప్రభుత్వ (మహిళా డిగ్రీ కళాశాల), ఈజట్లకు ఖమ్మం కేఎం డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ జె.ఉపేందర్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మహదేవపూర్: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సాహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంటును శుక్రవారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ప్రాథమిక సహకార సంఘం వద్ద కేడీసీసీ(కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ కోఆపరేటీవ్ సొసైటీ)బ్యాంకు వారి సహకారంతో రూ.25లక్షల రుణంతో ప్లాంట్ ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన మినరల్ వాటర్ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ హరిరాం నాయక్, ఫీల్డ్ ఆఫీసర్ రాజిరెడ్డి, సీఈఓ రాజబాబు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నెల్లికుదురు: స్నేహితుడితో కలిసి చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్ గురై మృతి చెందిన ఘటన మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రత్తిరాం తండాకు చెందిన గుగులోతు రవి (45) జామతండాకు చెందిన గుగులోతు నరేష్ ఆకేరు వాగులో చేపలు పట్టేందుకు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చేపలు పట్టడం తెలియని రవి విద్యుత్ షాక్‌తో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యా డు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే రవి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పేర్కొన్నారు. తన భర్త మృతికి కారణమైన గుగులోతు నరేశ్‌పై మృతుడి భార్య సుజాత ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు..



ఆదిత్య(ఫైల్)

తొర్రూరు: ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై జగదీష్ మాట్లాడుతూ... పట్టణానికి చెందిన బొమ్మగాని ఆదిత్య(20) తన సోదరుడి వివాహ ఊరేగింపు అనంతరం గురువారం రాత్రి 11 గంటల సమయంలో బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు సమీప బంక్‌కు వెళ్తున్నాడు. అదే సమయంలోఎదురుగా వేగంగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం పాలకేంద్రం సమీపంలో ఆదిత్యను ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలయ్యాడు. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేయూ దూరవిద్య అడ్మిషన్ల నోటిఫికేషన్

- ఈనెల 26వరకు దరఖాస్తుల స్వీకరణ
- బ్రోచర్‌ను ఆవిష్కరించిన వీసీ, రిజిస్ట్రార్



నోటిఫికేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యూకేషన్ (గతంలో ఎస్‌డీఎల్‌సీఈ)లో ఈవిద్యాసంవత్సరంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ బ్రోచర్‌ను వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, ఆ సెంటర్ డైరెక్టర్ ఆచార్య రాంచంద్రం శుక్రవారం క్యాంపస్‌లోని కమిటీ హాల్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాంచంద్రం అడ్మిషన్ల వివరాలు వెల్లడించారు. డిగ్రీలో బీఏ (హెచ్‌పీపీ, ఈపీపీ, ఎస్‌పీపీ), బీకాం జనరల్ అండ్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ మ్యాథ్స్, బీఎల్ఐఎస్సీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పీజీ కోర్సుల్లో ఎంఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, ఎకనావిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ ఎంఎల్ఐఎస్సీ, పలు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 26వ తేదీవరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని, రూ.300 అపరాధ రుసుముతో ఈనెల 30వరకు దరఖాస్తులు చేసుకోవచ్చనని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో లేదా.. ఆఫ్ లైన్‌లో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఫీజు, అర్హతల వివరాలు కేయూ దూరవిద్యాకేంద్రం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్‌డీఎల్‌సీఈకేయూ.కో.ఇన్‌లో చూడవచ్చని రాంచంద్రం తెలిపారు. యూజీజీ డిస్టెన్స్ ఎడ్యూకేషన్ బోర్డు, ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ సంస్థల నిబంధనలు, యూనిరవర్సిటీ చట్టం మేరకు తరగతులు ఉంటాయని అన్నారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య మల్లికార్జున్ రెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచే ట్రైబల్ వర్సిటీ తరగతులు

- హెచ్‌సీయూ మెంటర్‌గా నిర్వహణ
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పక్కన రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ కవిత

ములుగు/ములుగు రూరల్/వెంకటాపురం(ఎం): ఈ ఏడాది(2024–25) విద్యా సంవత్సరం నుంచి సమ్మక్క– సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తరగతులు ప్రారంభించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితతో కలిసి ములుగు మండలం జాకారం సమీపంలోని యూత్ ట్రెనింగ్ సెంటర్(వైటీసీ)లో యూనివర్సిటీ తాత్కాలిక క్యాంపు కార్యాలయాన్ని కిషన్‌రెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. భవన నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నోడల్ యూనివర్సిటీగా పని చేస్తుందని అన్నారు. గిరిజన యూనివర్సిటీ ములుగులో ఏర్పాటు చేయాలని కోరగానే ప్రధాన మంత్రి అంగీకరించారని తెలిపారు. పార్లమెంట్‌లో యూనివర్సిటీకి సమ్మక్క–సారక్కల పేరు పెట్టాలని ప్రతిపాదించిన వెంటనే ఒప్పుకున్నారని అన్నారు. రామప్ప అభివృద్ధికి ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్‌కు రూ.7కోట్లు, రాష్ట్రానికి మరో రూ.60కోట్లు ఇచ్చామని తెలిపారు. దేశ విదేశాల నుంచి టూరిస్టులు వస్తుంటారని, పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని మంత్రి సీతక్కకు సూచించారు. అనంతరం రాష్ట్ర మంత్రి సీతక్క మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఎక్కువ కోర్సులు అందుబాటులో ఉంచి గిరిజనులకు 35శాతం సీట్లు కేటాయించాలని కోరారు. ఇదిలా ఉండగా.. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీ ఫొటో ఫ్లెక్సీలో పెట్టకపోవడం, శిలాఫలకంపై తన పేరు లేకపోవడంతో ఎంపీ కవిత అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రొటొకాల్‌కు భంగం కలిగించినట్లు సభాముఖంగా తెలిపారు.

రూ.62 కోట్లతో అభివృద్ధి పనులు



పూజలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రామప్ప దేవాలయాన్ని సందర్శించే పర్యాటకుల కోసం ప్రశాద్ ప్రాజెక్టు క్రింద రూ.62కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆ యన రామప్ప దేవాలయాన్ని సందర్శించగా ఆల య పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామలింగేశ్వరస్వామికి అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం కిషన్‌రెడ్డిని ఆలయ అధికారులు సత్కరించారు. రామప్ప తూర్పు ముఖద్వారం వైపున రూ.62కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను కిషన్‌రెడ్డి పరిశీలించి విలేకరులతో మాట్లాడా రు. తొలివిడతగా మంజూరైన రూ.34కోట్లతో 20 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీ ష్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అడిషనల్ కలెక్టర్ మ హేందర్‌జీ, కంట్రోల్ ఎగ్జామినేషన్ పోరిక తుకారా ం, ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి, యూనివర్సిటీ ఇంజనీరింగ్ హనుమంతరావు, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్, జిల్లా ఆర్కియాలజికల్ హైదారాబాద్ సర్కిల్ అధికారిణి స్మిత ఎస్ కుమారి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, మల్లేష్, కుసుమ సూర్యకిరణ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారి దుర్మరణం

- వాటర్‌హీటర్‌ను పట్టుకోవడంతో ఘటన
- స్విచ్‌ఆఫ్ చేసినప్పటికీ షాక్‌కొట్టిన వైనం



గ్రేసి (ఫైల్)

రాయపర్తి: పెళ్లయ్యాక ఐదేళ్లకు జన్మించిన చిన్నారి పాప బుడి బుడి అడుగులతో ఇల్లంతా సందడిగా మారింది. కానీ, నేటినుంచి ఆ అడుగుల సవ్వడి వినబడదని తెలిసి ఆతల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సన్నూరు గ్రామానికి చెందిన చిన్నపాక రవికిరణ్, మమతల ఒక కుమార్తె గ్రేసి(5) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. ఇంటి ముందు ఉన్న స్విచ్‌బోర్డుకు రవికిరణ్ ఉదయాన్నే వాటర్‌హీటర్ పెట్టుకొని వేడి నీటితో స్నానం చేసి స్విచ్ ఆఫ్‌చేసి ఉంచారు. ఈ క్రమంలో గ్రేసిని తన తండ్రి సోమయ్య వద్ద వదిలి రవికిరణ్, మమత పనుల నిమిత్తం బయటికి వెళ్లారు. ఈ క్రమంలో ఆడుకుంటూ వెళ్లిన గ్రేసి వేలాడుతూ ఉన్న వాటర్‌హీటర్‌ను పట్టుకుంది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. చిన్నపాటి నిర్లక్ష్యం పాప ప్రాణాలు తీసిందని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి



రహీముద్దిన్(ఫైల్)

కేసముద్రం: చింతచెట్టు పైనుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని కల్వల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ.రహీముద్దిన్(60) చింతకాయలను తెంపడానికి తన ఇంటి ఆవరణలోని చింతచెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో కాలుజారడంతో కిందపడ్డాడు. తీవ్రగాయాలు కాగా.. హుటాహుటిన మానుకోటలోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సలీమా, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గట్లకానిపర్తిలో విషాదఛాయలు

- గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని సాహిత్య అనుమానాస్పదస్థితిలో మృతి



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు

శాయంపేట: పండుగ పూట ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. హసన్‌పర్తి పరిధి భీమారంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న శాయంపేట మండలం గట్లకానిపర్తికి చెందిన సాహిత్య (17) శుక్రవారం తెల్లవారుజామున అనుమానాస్పదస్థితిలో చనిపోయింది. కళాశాల యాజమాన్యం సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు కూతురి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. యాజమాన్యమే హత్య చేసి ఉంటారని ఆరోపిస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న గట్లకానిపర్తి గ్రామస్తులు పెద్ద ఎత్తున కాలేజీ వద్దకు తరలివచ్చారు. కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వల్లుల ప్రభాకర్, కవిత దంపతులకు పెద్ద కుమార్తె సాహిత్య హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా మిగిలిన ఇద్దరు కవల పిల్లలు సాత్విక, సాక్షిక నర్సంపేట ప్రాంతంలోని ఖానాపూర్ మహత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ప్రభాకర్ మెడికల్ షాపు నిర్వహిస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సాహిత్య కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని, చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందడంతో ఎంజీఎం మార్చురీకి మృతదేహాన్ని తరలించామని కళాశాల యాజమాన్యం శుక్రవారం ఉదయం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సాహిత్య ఎడమ చేతి మణికట్టు వద్ద కోసుకున్నట్లు ఉండటం , చేతిపై రివర్స్‌లో సారీ రాసి ఉండడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు కళాశాల యాజమాన్యమే తమ బిడ్డను హత్య చేసి ఉంటారని భావిస్తూ కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కళాశాల ఎదుట ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. పోలీసులు కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. సాహిత్య రాసిన సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. సాహిత్య మృతి వార్త తెలుసుకున్న గట్లకానిపర్తి మాజీ సర్పంచ్ బొమ్మకంటి సాంబయ్య, మాజీ కో ఆప్షన్ గుర్రం అశోక్ తోపాటు గౌడ కులస్తులు, ప్రభాకర్ కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో కళాశాల వద్దకు చేరుకున్నారు. చివరికి పోలీసుల జోక్యంతో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది. అనంతరం శుక్రవారం సాయంత్రం 6గంటలకు మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూడానికి గ్రామస్తులు తండోపతండాలుగా వచ్చారు. సాహిత్య మృతితో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కష్టం వృథాకావొద్దని..



నారుపోసి.. నీరుపెట్టి చంటి బిడ్డలా కాపాడిన పంట పొట్టకొచ్చింది. ఇక చేతికొస్తే చాలని సంబురపడుతున్న సమయంలో నీరులేక కళ్లెదుటే ఎండిపోతున్న పంటను చూసి అన్నదాత కంగు తిన్నాడు. పంటను ఎలాగైనా కాపాడాలనుకున్నాడు. చేసిన కష్టం వృథా కావొద్దని తలిచి ట్యాంకర్లతో నీటిని తీసుకొచ్చి వరిపొలానికి పడుతున్నాడు.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని గుబ్బెడుతండాకు చెందిన రైతు బోజ్యానాయక్. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

- రాయపర్తి